సాక్షి సంగారెడ్డి

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



భక్తులతో పంచవటి కిటకిట

మండల పరిధిలోని రాఘవాపూర్–హుమ్నా పూర్ గ్రామాల శివారులో కొనసాగుతున్న కుంభమేళ ఉత్సవాలకు బుధవారం కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. 8లో



ఫ్లెక్సీల వివాదం

జోగిపేట మున్సిపాలిటీలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఫ్లెక్సీ వివాదం చోటుచేసుకుంది. కాంగ్రెస్ కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణ ఇటీవల ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 8లో

నలుగురికి పాజిటివ్



పటాన్‌చెరు టౌన: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 19 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో నలుగురికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 18 మందికి నిర్వహించినట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

భగీరథ మహర్షి జయంతిని జయప్రదం చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: నేడు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న భగీరథ మహర్షి జయంతిని జయప్రదం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. బుధవారం భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

దశల వారీగా సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్యే మాణిక్‌రావు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాజోల, వడ్డి గ్రామాల్లో రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా అంతర్గత రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాల కోసం అవసరమైన నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్లు ఇటీవల మంజూరు చేసినట్లు తెలిపారు. పంచాయతీ భవన నిర్మాణాలకు కూడా భారీగా నిధులు మంజూరు చేశామన్నారు. ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ, ఉపాధ్యక్షుడు గౌసొద్దీన్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవికుమార్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డిటౌన్: జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన బుధవారం తెలిపారు. సుస్థిర ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్ కంపెనీలో 50 ఉద్యోగాల భర్తీకి ఏప్రిల్ 28న ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్‌లోగల పాత వెలుగు ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 28 సంవత్సరాల లోపు ఉండాలని, టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. జీతం 15 వేల నుంచి 18 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 28న నిర్ణీత సమయంలోగా తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, టెన్త్ మెమో, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో నేరుగా హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08455271010 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

జాతీయ ఉత్తమ సామాజిక సేవా అవార్డుకు ఎంపిక



రామకృష్ణ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మే 14న మదర్స్ డేను పురస్కరించుకుని జాతీయ ఉత్తమ సామాజిక సేవాఅవార్డుకు ఉపాధ్యాయుడు డాక్టర్ పాత్రు రామకృష్ణ ఎంపికైనట్లు వల్లూరి ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సేవాఅవార్డును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్లు బుధవారం తెలిపారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దటంతో పాటు సామా జిక సేవలో రామకృష్ణ చేసిన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్య గొప్పతనం, దాని ఫలాలు ప్రతీఒక్కరికీ అందాలని, ముఖ్యంగా మహిళా సాధికారత, సామాజిక అంశాలపై చురుకుగా పాల్గొంటూ, ప్రజలను చైతన్యవంతులను చేయడం వంటి అంశాలలో ఆయన తన వంతు పాత్ర పోషిస్తున్నా రని పేర్కొన్నారు. అనంతరం అవార్డుకు ఎంపికైన రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ ఉత్తమ సామాజిక సేవా అవార్డుకు ఎంపిక కావడం పట్ల సంతోషగా ఉందన్నారు. వల్లూరు ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞ తలు తెలిపారు. కాగా రామకృష్ణ సదాశివపేట మండలంలోని నిజాంపూర్.కే ప్రాథ మిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అవార్డుకు ఎంపికకావడంపై ఎంఈఓ దండు అంజయ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనను అభినందించారు.

రాలిన ఆశలు..

- అకాల వర్షంతో ఆగమాగం
- నేలరాలిన ధాన్యం గింజలు, మామిడి కాయలు
- నష్టం నామమాత్రమే అంటున్న వ్యవసాయశాఖ
- ఉద్యానవన పంటలకు ఐదు శాతం నష్టమన్న అధికారులు
- నిజాంపేట, కల్హేర్ మండలాల్లో వడగండ్ల వాన



నారాయణఖేడ్‌: రాలిన వడ్లను చూపుతున్న రైతు



నిజాంపేట మండలం రాంరెడ్డిపేటలో నేలరాలిన వరి గింజలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పంట నష్టం అంచనాల విషయంలో వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారుల తీరు విడ్డూరంగా ఉంది. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షంతో పంటలకు భారీగా నష్టం వాటిల్లి రైతులంతా లబోదిబో మంటుంటే, పంట నష్టం 30 శాతం లోపే నష్టం ఉందని ఈ రెండు శాఖల అధికారులు చేతులెత్తేయడం విమర్శలకు తావిచ్చింది.

- మంగళవారం కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా కేవలం 316 ఎకరాల్లో మాత్రమే వరికి నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా తేల్చింది. కానీ జిల్లాలో వాస్తవ పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది.
- జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కలిపి సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వరికి నష్టం వాటిల్లగా, కేవలం కల్హేర్, నిజాంపేట మండలాల్లో మాత్రమే పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా తేల్చింది.
- జిల్లాలో నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాల పరిధిలో వేలాది ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లింది. ఈదురు గాలులు, వర్షంధాటికి గింజలన్నీ నేలరాలిపోయాయి.
- పంట చేతికందే దశలో వరి పొలంలో రాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

నష్టమే లేదంటున్న ఉద్యానవనశాఖ

- అకాల వర్షంతో పంట నష్టం విషయంలో ఉద్యానవనశాఖ తీరు మరీ దారుణంగా తయారైంది. మంగళవారం కురిసిన వర్షానికి ఉద్యానవన పంటలకు అసలు నష్టమే వాటిల్లలేదని తేల్చింది.
- అక్కడక్కడ 5 శాతం లోపే ఉద్యానవన పంటలకు నష్టం జరిగిందని, నిబంధనల ప్రకారం 30 శాతం నష్టపోతేనే పంట నష్టం కింద రికార్డుల్లో పేర్కొంటామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.
- కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. మామిడికాయలు చాలా వరకు నేల రాలిపోయాయి.
- వారం క్రితం కురిసిన వర్షానికి సగానికిపైగా మామిడి కాయలు రాలిపోగా, మంగళవారం కురిసిన అకాల వర్షానికి మిగిలిన కాయల్లో చాలా మట్టుకు రాలిపోయాయి.
- మంగళవారం కురిసిన వర్షానికి ఐదు శాతం లోపే నష్టం ఉందని ఆ శాఖ ప్రాథమికంగా తేల్చడం గమనార్హం.

పలుచోట్ల కుండపోత

- వర్షాకాలంలో కురిసే వాన మాదిరిగా మంగళవారం జిల్లాలో పలుచోట్ల కుండపోత వర్షం పడింది.
- రామచంద్రాపురంలో ఏకంగా 13.2 సెం.మీల వర్షం పడింది. అలాగే అమీన్‌పూర్, పటాన్‌చెరువు 10 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదు కావడం గమనార్హం.
- జిన్నారం, నాగల్‌గిద్దల్లో 5 సెం.మీల చొప్పున వర్షం కురిసింది. నారాయణఖేడ్, కోహీర్, కొండాపూర్, సంగారెడ్డి, కందిల్లో 3 సెంమీలకు చొప్పున వర్షం పడింది.
- జిల్లాలో సగటున 3.26 సెం.మీల వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- మంగళవారం కురిసిన వర్షానికి రామచంద్రాపురంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.
- ఇక్కడ భారీ వర్షం కురియడంతో శ్రీనివాస్‌నగర్, పాత రామచంద్రాపురం, భారతీనగర్, ఎంఐజీ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరువచ్చి చేరింది.
- కొందరి ఇళ్లలోకి కూడా నీళ్లు రావడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలుల దాటికి బీహెచ్ఈఎల్, తెల్లాపూర్‌లో చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. జీహెచ్ఎంసీ అధికారులు వాటిని తొలిగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

గింజలన్నీ రాలిపోయాయి



ఈసారి మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. ఈదురు గాలులు, వడగళ్లతో వరి గింజలన్నీ నేల రాలిపోయాయి. వరి కోసేందుకు సిద్ధమవుతున్న దశలో ఈదురు గాలులు, వర్షం పంటను నాశనం చేసింది. వ్యవసాయ అధికారులు వచ్చి నమోదు చేసుకున్నారు. నష్టపోయిన మాకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– శనిగారి పెంటయ్య, రాంరెడ్డిపేట్, నిజాంపేట మండలం

ప్రభుత్వాలపై పోరాటాలు తీవ్రతరం చేస్తాం

బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్



ఆందోళన చేస్తున్న కార్మికులు

కొండాపూర్(సంగారెడ్డి): కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలపై పోరాటాలను తీవ్ర తరం చేస్తామని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ వ్యాఖ్యానించారు. బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పాట్నాలో జరిగిన జాతీయ మహాసభల్లో కార్మికుల సంక్షేమం కోసం నాలుగు తీర్మానాలు చేశారని గుర్తు చేశారు. ఈ తీర్మానాలను ప్రభుత్వాలు అమలు చేయాలని కోరుతూ భారతీయ మజ్దూర్ సంఘ్ దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్మికులందరికీ సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అసంఘటిత కార్మికులకు పెన్షన్‌తో సహా, సార్వత్రిక సామాజిక భద్రత, దేశంలోని 48 మంది కోట్ల కార్మికులతో సహా దేశంలోని పౌరులకు సామాజిక భద్రత రాజ్యాంగ హక్కు అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు అనే సూత్రాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, విజయ్, ప్రభు, జనార్దన్‌రెడ్డి, అంజయ్య, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: దళారులను నమ్మి రైతులు మోసపోకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి కోరారు. నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో పౌరసరఫరాల శాఖ, ఐకేపీ సంయుక్త ఆధ్వర్యంలో, మండల కేంద్రమైన నిజాంపేటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అన్నారు. ప్రతీ పంటకూ మద్దతు ధర ఇస్తూ అన్ని విధాలుగా రైతులను ఆదుకొంటుందన్నారు. వరి ధాన్యన్ని క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రూ.2,060, కామన్ గ్రేడ్‌కు రూ.2,040కు కొనుగోలు చేయడం జరుగుతోందన్నారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, ఎంపీటీసీ భూపాల్, సర్పంచ్‌లు జగదీశ్వరాచారి, ఎంబరి విఠల్, ఉప సర్పంచ్ భూంరెడ్డి, ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్, ఆర్ఐ మాధవరెడ్డి, ఏఈవో సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఖేడ్ మండలం మెఘ్యానాయక్ తండాకు చెందిన బానానాయక్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.11వేలు మంజూరైంది. ఆ చెక్కును ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

పత్తి తూకంలో మోసం


నష్టపోయిన కోనాపూర్ రైతులు



మోసపోయిన రైతులతో మాట్లాడుతున్న రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): పత్తి తూకంలో దళారులు రిమోట్ సెన్సింగ్‌తో మోసానికి పాల్పడుతూ రైతులను నిండా ముంచుతున్నారు. మండల పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన రైతులు వీరయ్య, వీరన్న, మగ్బూల్ మియా, రాజశేఖర్, ఈశ్వరప్ప తదితరులు రెండు రోజుల క్రితం పత్తి దళారులకు దాదాపు 270 క్వింటాళ్ల పత్తిని క్వింటాల్‌కు రూ 7, 800 చొప్పున విక్రయించారు. దళారులు క్వింటాల్‌కు దాదాపుగా 8 కేజీల చొప్పున అదనంగా పత్తిని తూకం చేస్తూ దగా చేస్తున్నారు. పత్తిని తూచే కాంటా రిమోట్ సిస్టం కావడంతో రైతులు మొదట పసిగట్టలేకపోయారు. తూకంలో దళారులు రిమోట్ కంట్రోల్ సెన్సింగ్ సహాయంతో దాదాపుగా 60 క్వింటాళ్ల పత్తిని మోసం చేయడాన్ని గ్రాహించారు. పత్తి తూకంలో గోల్ మాల్ జరగడంతో వారు బుధవారం సదాశివపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సదరు దళారులను పోలీసులు స్టేషన్ కు పిలిచారు. వారితో మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్, శివ కుమార్ చర్చలు జరిపారు. దీంతో చివరికి దళారులు 39 క్వింటాళ్ల పత్తి డబ్బులను చెల్లించేందుకు అంగీకరించారు. పలు గ్రామాల్లో దళారులు పత్తిని కొనుగోలు చేస్తుండటంతో అనుమానం వచ్చిన రైతులు రిమోట్ కాంటా మోసాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇప్పటికే అమ్ముకున్న రైతులు లబోదిబోమంటున్నారు. ఇలాంటి దళారులు ఇంకా చాలా మంది ఉన్నట్లు తెలుస్తుంది. జిల్లాలో అత్యధికంగా పత్తి సాగుకావడంతో దళారులు మోసాలకు పాల్పడుతున్నారు. అయితే, ఈ మోసాలను అరికట్టాల్సిన తూనికలు, కొలతల శాఖ పర్యవేక్షణ కొరవడిందని ఆరోపిస్తున్నారు.

స్వీప్ కార్యక్రమాలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: పట్టణ ప్రాంతాల్లో స్వీప్ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ నిర్వహించారు. స్వీప్ ఆక్టివిటీస్, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ, ఓటరు జాబితాలో ఎఫ్ఎల్‌సి, పీఈటీ తొలగింపు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓటర్ల పునః పరిశీలన 75 శాతం పూర్తయిందన్నారు. ఈనెల 25న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించామని తెలిపారు. ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు పరిశీలనకు ఇచ్చామన్నారు. రెండు రోజుల్లో పరిశీలన పూర్తి చేసి, నెలాఖరులోగా నివేదిక అందజేస్తామన్నారు. జిల్లాలో 1560 మందిని బూత్ లెవెల్ అధికారులుగా నియమించామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీపీఓ సురేశ్ మోహన్, రెవెన్యూ డివిజన్ అధికారులు రమేశ్ బాబు, అంబదాస్, తహసీల్దార్లు విజయ్ కుమార్, పరమేశ్వర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమ్మె నోటీసు

జోగిపేట(అందోల్): ఈనెల 28వ తేదీ నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్నందున బుధవారం తహసీల్దార్ వెంకటేశ్‌కు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబిషనరీ కాలం నాలుగేళ్ల గడువు ముగిసినందున జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక వాట్సాప్ గ్రూపులో నుంచి కూడా లెఫ్ట్ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడి మృతి



సుశీల్ బాబు

సంగారెడ్డి మున్సిపాలిటీ: టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు సుశీల్ బాబు బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావు బుధవారం సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన సుశీల్ బాబు మృతి తీరని లోటన్నారు. సుశీల్ బాబు మరణ వార్త తెలుసుకున్న ప్రముఖులు, నాయకులు ఆయన ఇంటికి వెళ్లి పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

విదేశాలలో ఉద్యోగ అవకాశాలు

కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి టౌన్: అర్హత, నైపుణ్యం కలిగిన సెమీ స్కిల్డ్ కార్మికులకు తెలంగాణ ఓవర్సీస్ మేన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా విదేశాలలో ఉద్యోగ అవకాశాలను కలిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ బుధవారం తెలిపారు. టామ్ కామ్ ద్వారా గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, జర్మనీ, మలే షియా, యూకేలో ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సీఎన్‌సి లేదా ఫస్ట్ క్లాస్ మెకానిస్ట్, సెక్యూరిటీ సిస్టమ్స్ టెక్నీషియన్స్, అడ్మినిస్ట్రేటర్స్, ప్రాజెక్ట్ మేనేజర్, కన్సల్టెంట్స్, ఐటీ సపోర్ట్స్, టెక్నికల్ సూపరింటెండెంట్స్, సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్, వెల్డర్, హెవీ ట్రావెలింగ్ వెహికల్ డ్రైవర్, క్లీనర్ లేదా జనరల్ హెల్పర్ తదితర ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. టామ్ కామ్ వెబ్‌సైట్‌లో ఆయా దేశాలలో ఉద్యోగాల వివరాలు, అర్హతలు వేతనం వివరాలు ఉంటాయని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు టామ్ కామ్ వెబ్సైట్ ద్వారా, లేదా మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకోవచ్చని, లేదా hrm & tomcom & letf@telangana మెయిల్ ద్వారా తమ రెజ్యూమ్‌ను పంపవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో నేరుగాగాని, 08455 271010 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్

ఝరాసంగం(జహీరాబాద్): వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్ డిమాండ్ చేశారు. ఐకేపీ వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఐకేపీ వీఓఏల సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. వీఓఏలు పరిసరాలను శుభ్రం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వీఓఏలు విధి నిర్వహణతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాయిలు, ప్రధాన కార్యదర్శి ముస్తఫా, డివిజన్ కార్యదర్శి మహిపాల్, మండల అధ్యక్షురాలు పద్మారాణి పాల్గొన్నారు.

నేటి నుంచి నల్లపోచమ్మ జాతర

- ఏడు వారాలపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు
- భేతాళ స్వామిజాతర, ఎల్లమ్మ తర్వాత జరిగే జాతర
- నిత్యపూజలతో కిటకిటలాడుతున్న ఆలయం



బోరంచ నల్లపోచమ్మ ఆలయం

మనూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన బోరంచ నల్ల పోచమ్మ ఆలయం మంజీరా నది ఒడ్డున ఉంది. ఈ ఆలయానికి విశేష చరిత్ర ఉంది. బోరంచ నల్లపోచమ్మ అమ్మవారిని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారే స్వయంగా ప్రతిష్ఠించినట్లు భక్తుల విశ్వాసం. అమ్మవారి ఆలయాన్ని 2002లో పునరుద్ధరించారు. అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

- జిల్లాలో ఎక్కడా లేనివిధంగా అమ్మవారికి ఇంత పెద్ద ఆలయం ఇక్కడే ఉంది. ఆలయ రాజగోపురాన్ని మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన భక్తుడు దందోజి ఆర్థిక సహకారంతో నిర్మించారు.
- మూడేళ్ల క్రితం ఎండోమెంట్ పరిధిలోకి వెళ్లింది.

ఏప్రిల్‌లో మహా జాతర

- ఏప్రిల్‌లో ఇక్కడ అమ్మవారికి ప్రత్యేక జాతర జరుగుతుంది. అల్లాదుర్గం భేతాళ స్వామి జాతర అనంతరం ర్యాకల ఎల్లమ్మ జాతర తర్వాత బోరంచ పోచమ్మ తల్లి జాతర ఏడువారాలపాటు కొనసాగుతాయి.
- ఈ జాతర దాదాపుగా 45 రోజులపాటు కొనసాగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ 27 తేదీ నుంచి జూన్ 8వ తేది వరకు కొనసాగుతుందని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు.

అమ్మవారికి మంత్రి ముక్కుపుడక బహూకరణ

- మంత్రి హరీశ్‌రావు అమ్మవారికి ముక్కుపుడుకను బహూకరించారు. ఇటీవలే బసవేశ్వర ఎత్తిపోతల పనుల ప్రారంభానికి వచ్చిన సందర్భంగా అమ్మవారికి మరో ముక్కుపుడకను బహూకరిస్తామని ప్రకటించారు.
- ఇందుకు సంబంధించి జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

ఆలయానికి ఇలా చేరుకోవచ్చు

- బోరంచ నల్లపోచమ్మ ఆలయానికి చేరుకోవాలంటే నారాయణఖేడ్ నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. ఇవి ఉదయం 8, 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు నడుపుతున్నారు.
- ఇవేకాకుండా ఖేడ్ నుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటో సౌకర్యం ఉంది.
- జహీరాబాద్ నుంచి వచ్చేవారు రేగోడ్ మండలం టీ.లింగంపల్లి బోరంచ కమాన్ నుంచి ఆలయానికి చేరుకోవచ్చు.
- రేగోడ్ మండలం నుంచి ఆటోలు అందుబాటులో ఉంటాయి. బీదర్, మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనదారులు ఖేడ్ నుంచి ఆలయానికి చేరుకోవచ్చు.

భక్తుల కోసం ఏర్పాట్లు

ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విడిదికి ప్రత్యేక వసతులు ఉన్నాయి. ఆలయంలో బారికేడ్‌లు, ఆలయం చుట్టు సత్రాల పందిరి ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ గురువారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, విశేష పూజలు జరుగుతాయి.

– మోహన్‌రెడ్డి, ఆలయ ఎండోమెంట్ ఈఓ, బోరంచ

క్లుప్తంగా

దుర్గాభవాని బ్రహ్మోత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్



దుర్గాభవాని ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పోచారంలో జరుగుతున్న దుర్గాభవాని వార్షిక బ్రహ్మోత్సవానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీ బుధవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మధులత, సర్పంచ్ స్వాతి, బీఆర్ఎస్ నాయకులు కనకారెడ్డి, కిషన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నిరసనకు తరలి రావాలి



మాట్లాడుతున్న పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం చేర్యాల అంగడి బజార్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపడతామని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ తెలిపారు. బుధవారం వాసవి గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు ఆత్మస్థైర్యం కల్పించాలని కోరారు. వరి, పత్తి విత్తనాలతో పాటు ఎరువులను 50శాతం సబ్సిడీతో అందజేసి ఆదుకోవాలన్నారు. ఖరీఫ్‌కి రైతు బంధును జూన్ మొదటి వారంలోనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ, అఖిలపక్షం నాయకులు ఆగం రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, నర్సింగరావు, కళావతి, సత్యనారాయణ, బిక్షపతి, లింగం, వెంకట్‌మావో, వెంకటస్వామి, రాజిరెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్, మల్లేశం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మ హత్య

చేగుంట(తూప్రాన్): ఒంటరిగా జీవిస్తున్నానని మనస్తాపంతో వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నశివునూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..చిన్నశివునూర్ గ్రామానికి చెందిన సుంచు బాబు(28) నాలుగు సంవత్సరాల క్రితం ఇదే మండలానికి చెందిన ఉల్లి తిమ్మాయిపల్లికి ఇల్లరికం వెళ్లాడు. అక్కడ భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో కొద్ది రోజుల నుంచి చిన్నశివునూర్‌లోనే ఉంటున్నాడు. బాబు తల్లిదండ్రులు యాదమ్మ కిషన్‌లు ఉపాధి కోసం సికింద్రాబాద్‌కు వెళ్లిపోగా ఇంట్లో ఒక్కడే ఉంటూ తను ఒంటరినని గ్రామస్తులతో చెబుతూ బాబు నిత్యం బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉరి వేసుకొని బాబు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గ్రామానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులతో పంచవటి కిటకిట

వైభవంగా కొనసాగుతున్న కుంభమేళా

న్యాల్‌కల్(జహీరాబాద్): కుంభమేళా వైభవంగా కొనసాగుతుంది. మండల పరిధిలోని రాఘవాపూర్-హుమ్నాపూర్ గ్రామాల శివారులో కొనసాగుతున్న కుంభమేళ ఉత్సవాలకు బుధవారం కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పవిత్రమైన మంజీర నదిలో పుణ్యస్నానాలు చేశారు. నారాయణఖేడ్ ఆర్టీసీ అధికారులు కుంభమేళా నుంచి జహీరాబాద్, బీదర్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాలకు బస్సులు నడపడంతో భక్తుల తాకిడి అధికమైంది. ప్రస్తుతం పవిత్ర దినాలు కావడంతో చిన్నా, పెద్ద తేడా లేకుండా భక్తులు మంజీర నదిలో స్నానాలు చేస్తున్నారు. అనంతరం గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పుణ్యస్నానాలు చేసిన భక్తులు సాధు, సంతుల దర్శనం చేసుకుంటున్నారు. దిగంబర సాధువులను చూసి భక్తులు కొంత సేపు అలానే నివ్వెరపోతున్నారు. భక్తి పారవశంలో తేలిపోతున్నారు. వేద బ్రాహ్మణులు క్షేత్ర ఆవరణలో హోమాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం పంచవటి క్షేత్రం నుంచి మంజీర నది వరకూ ఆశ్రమ పీఠాధిపతి కాశీనాథ్‌బాబాను ప్రత్యేక వాహనంలో కూర్చొబెట్టి తీసుక వెళ్లారు. నది వద్ద సాధువులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా గంగాదేవికి ప్రత్యేక పూజలు చేసి మహా మంగళ హారతి ఇస్తున్నారు.



పోటెత్తిన భక్తులు

కొనసాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు

క్షేత్రం ఆవరణలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కర్నాటక ప్రాంతానికి చెందిన భజన మండలి ఆధ్వర్యంలో భజనలు నిర్వహిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఈ వేడుకలో పాల్గొంటున్నారు.

వైద్య శిబిరాల పరిశీలన

భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కుంభమేళాలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ఎప్పటికప్పుడు డీఎంహెచ్ఓ గాయత్రిదేవి పరిశీలిస్తున్నారు. మందుల నిల్వ, రోగులకు అందిస్తున్న సేవలను ఆమె వైద్యులు స్వేతప్రియను అడిగి తెలుసుకుంటున్నారు. భక్తులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా? లేవా? వంటి విషయాలను స్వేతప్రియ నుంచి డీఎంహెచ్ఓకు తెలుసుకుంటున్నారు.



మంజీర నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



క్షేత్ర ఆవరణలో హోమం నిర్వహిస్తున్న బ్రాహ్మణులు



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ



ఇరు పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ, మున్సిపల్ కమిషనర్

ఫ్లెక్సీల వివాదం

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల ఫిర్యాదు

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య బుధవారం ఫ్లెక్సీ వివాదం చోటుచేసుకుంది. కాంగ్రెస్‌కు చెందిన మున్సిపల్ కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణ జోగిపేటలోని జోగినాథ్ చౌరస్తా వద్ద ఇటీవల ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ మినీ ప్లీనరీ సందర్భంగా సదరు ఫ్లెక్సీని అతడికి చెప్పకుండా తొలగించారు. ఆ స్థానంలో బీఆర్ఎస్‌కు చెందిన శ్రీధర్ పేరుతో మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో వివాదానికి కారణమైంది. ప్లీనరీ పూర్తవడంతో తన ఫ్లెక్సీని తిరిగి ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నిస్తుండగా ఇరు పార్టీ నాయకుల మధ్య తీవ్ర వివాదం చోటు చేసుకొని ఒకరినొకరు తోసుకునేంతవరకు వచ్చింది. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎస్ఐ సామ్యానాయక్ పోలీస్ సిబ్బందితో అక్కడకు చేరుకొని గుంపును చెదరగొట్టారు. మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించడంతో కమిషనర్ తిరుపతి అక్కడకు చేరుకొని అన్ని ఫ్లెక్సీలను తొలగిస్తానని హామీ ఇచ్చారు. తనపై దాడి చేసేందుకు ప్రయత్నించిన శ్రీధర్ నాయకులతో కలిసి సత్యనారాయణపై జోగిపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. తన ఫ్లెక్సీని తనకు తెలియకుండా తొలగించినందుకు శ్రీధర్‌పై సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. ఇరువురిని సముదాయించే క్రమంలో అక్కడకు వెళ్లినందుకు తనను తిట్టారని అంబేడ్కర్ సంఘం నాయకుడు యాదయ్య ఫిర్యాదు చేశారు.

విచారణఖైదీలు న్యాయసేవలు పొందొచ్చు



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: విచారణ ఖైదీలు న్యాయ సేవలు పొందొచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు తెలిపారు. బుధవారం కందిలోని జిల్లాజైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జైలులో ఖైదీలకు అందజేస్తున్న భోజనం, వారికి అందుతున్నా సదుపాయాలు, అక్కడి వాతావరణం ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. వంటశాలను తనిఖీ చేశారు. ఖైదీలకు ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా తనను సంప్రదించాలన్నారు. జైలును పరిశుభ్రంగా ఉంచుకునేలా జైల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాజైలు సూపరింటెండెంట్ భరత్, డిప్యూటీ జైలర్లు జవాన్లు, జైలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించాలని ఆన్‌లైన్ మోసం

నర్సాపూర్: ఆస్తి పన్ను చెల్లించాలనే నెపంతో ఆన్‌లైన్ మోసానికి గురైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..బుధవారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి తనకు ఫోన్ చేసి తాను మున్సిపల్ ఆఫీస్ నుంచి శ్రీనివాస్ మాట్లాడుతున్నానని, మీ దుకాణం వద్దకు రెండు రోజులుగా తిరుగుతున్నానని, దుకాణం మూసిఉంటుందని నమ్మబలికాడు. మాటల్లో పెట్టి మీ ఇంటి పన్ను రూ.3,330లు బకాయి ఉన్నట్టు చెప్పాడు. వెంటనే ఈ బకాయినీ గూగుల్ పే ద్వారా చెల్లించాలని సూచించాడు. సదరు స్థానిక వ్యాపారి వేణు అందుకు సరేనని చెప్పడంతో ఆ గుర్తు తెలియని వ్యక్తి తమ సార్ గూగుల్ పే నంబర్ అని చెప్పి ఇచ్చాడు. గుర్తు తెలియని ఆగంతకుడు ఇచ్చిన నంబరుకు వ్యాపారి వేణు రూ.3,330లు గూగుల్ పే ద్వారా చెల్లించాడు. వెంటనే గుర్తు తెలియని వ్యక్తి మళ్లీ ఫోన్ చేసి నీ జీఎస్‌టీ టాక్స్ సైతం బకాయి ఉందని, అది చెల్లిస్తే నీకు ఓటీపీ వస్తుందని, ఆ నెంబర్ చెప్పాలని అడగ్గానే తనకు అనుమానం వచ్చింది. వెంటనే తను మున్సిపల్ ఆఫీసుకు వచ్చి మాట్లాడుతానని చెప్పి ఆ ఫోన్‌ను డిస్కనెక్ట్ చేశాడని వేణు తెలిపాడు. తాను మున్సిపల్ ఆఫీసుకు వెళ్లి విచారించగా అక్కడ శ్రీనివాస్ పేరిటా ఎవరూ లేరని చెప్పడంతో తాను మోస పోయినట్లు గుర్తించాడు. ఈ విషయంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తానని బాధితుడు పేర్కొన్నాడు.

గాలివాన బీభత్సం

విరిగిన విద్యుత్ స్తంభాలు.. కూలిన ఇళ్లు



మల్లంపేట్‌లో కూలిన ఇళ్లు

పాపన్నపేట(మెదక్): గాలివాన సృష్టించిన బీభత్సంతో చేతికొచ్చిన పంటలను నిండా ముంచింది. ఈదురుగాలులు, వడగళ్ల వానతో పంటలు నేలమట్టం కాగా, విద్యుత్ స్తంభాలు విరిగి, ట్రాన్స్‌ఫార్మర్‌లు, చెట్లు నేల కూలాయి, ఇండ్లపై కప్పులు ఎగిరిపోయాయి. మామిడి కాయలు నేలరాలాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ కరెంట్ లేక జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని 29 గ్రామాల్లో 3,891 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. 2,617 మంది రైతులు నష్టపోయారు. మల్లంపేట్, దౌలాపూర్‌లతో పాటు పలు గ్రామాల్లో ఇండ్లపై కప్పులు ఎగిరిపోయాయి. మిన్పూర్, ఏడుపాయల కమాన్ వద్ద రోడ్డుపై చెట్లు విరిగి పడటంతో మెదక్-బోడ్మట్‌పల్లి రోడ్డు దారి మూసుకపోయింది.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ తండాలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఖాజాపూర్ తండాకు చెందిన బిలియా నాయక్(35) తన ఇంట్లో విద్యుత్ సరఫరా అవుతున్న సర్వీస్ వైరును సరి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. భార్య ఓరిజోలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నారాయణఖేడ్: ఈదురు గాలులకు రోడ్డుపై పడ్డ ముళ్లచెట్టును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నారాయణఖేడ్ మండలం హంగిర్గా(కె)కు చెందిన గైని రమేశ్ (44) తన ద్విచక్రవాహనంపై ఖేడ్‌కు వచ్చాడు. మంగళవారం సాయంత్రం నుంచి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వీస్తుండగా తిరిగి స్వగ్రామానికి వెళ్లడానికి ఖేడ్‌లో నిరీక్షించాడు. హంగ్రాన(జి) గ్రామం వద్ద ఈదురుగాలులకు పెద్దముళ్లచెట్టు విరిగి రోడ్డుపై పడింది. రాత్రి వర్షం కాస్త తగ్గడంతో రమేశ్ ద్విచక్రవాహనంపై సొంత గ్రామానికి వెళుతుండగా రోడ్డుపై పడ్డ చెట్టును ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో రమేశ్‌కు తలపగిలి తీవ్రగాయాలయ్యాయి. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు గమనించి 108కు సమాచారం అందించడంతో ఖేడ్ ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది.



రోడ్డుపై చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

దుబ్బాక: మూడు సంవత్సరాల క్రితం గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో రోడ్డు ప్రమాదానికి గురైనా రాయపోల్ మండల కేంద్రానికి చెందిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ వివరాల ప్రకారం ..రాయపోల్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి ఎలక్షన్(38) ఓ దిన పత్రికలో ఏజెంటుగా పనిచేస్తూ తన కున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటున్నాడు. 3 సంవత్సరాల క్రితం ప్రజ్ఞాపూర్‌లో పేపర్ సర్క్యులేషన్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలై కొద్ది రోజులు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురవడంతో మెరుగైనా వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం మృతుడి భార్య బాల్‌లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఎలక్షన్ (ఫైల్)

ఇద్దరి బైండోవర్

కల్హేర్(నారాయణఖేడ్): మార్డిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను బుధవారం కల్హేర్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు ఎదుట బైండోవర్ చేశామని నారాయణఖేడ్ ఎక్సైజ్ సీఐ మహేశ్ తెలిపారు. బీబీపేట జంలా తండాలో అక్రమంగా కల్లు విక్రయిస్తున్న రాంధాన్‌ను అరెస్టు చేసి బైండోవర్ చేశామన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది సాయిలు పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయంలో చోరీ



హుండీ పగలగొట్టిన దృశ్యం

సిద్దిపేటకమాన్: పోచమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి గుర్తుతెలియని దుండగులు నగదు ఎత్తుకెళ్లిన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ రోడ్డులోని పోచమ్మ దేవాలయంలో గణబోయిన కనకవ్వ పూజారిగా పనిచేస్తోంది. ఆమె రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి గుడికి తాళం వేసి ఇంటికి వెళ్లింది. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి హుండీ పగలగొట్టి ఉండడాన్ని గుర్తించింది. దీంతో ఆలయ అధ్యక్షుడు బాపురెడ్డికి ఫోన్ ద్వారా ఆమె సమాచారం తెలియజేసింది. దీంతో వారు వచ్చి పరిశీలించగా గుడి తాళంతో పాటు లోపల ఉన్న రెండు హుండీ తాళాలు పగలగొట్టి, గుర్తు తెలియని వ్యక్తులు నగదు ఎత్తుకెళ్లినట్లు వారు గుర్తించారు. గత సంవత్సరం హుండీ లెక్కింపులో రూ.1,50,000లు ఆదాయం సమకూరినట్టు చెప్పారు. ఈ సంవత్సరం కూడా సుమారు అంతే మొత్తం హుండీలో ఉండొచ్చని నిర్వహకులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాలుగు పాడిగేదెలు..

నర్సాపూర్ రూరల్: నాలుగు పాడిగేదెలు చోరీకి గురైన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ..నర్సాపూర్‌కు చెందిన కటికే మహ్మద్ జమీర్‌కు చెందిన నాలుగు పాడి గేదెలను పశువుల పాక నుంచి 24వ తేదీ వేకువ జామున గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారని చెప్పారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పూడ్చిన శవానికి పోస్టుమార్టం

పుల్‌కల్(అందోల్): పూడ్చిన శవానికి పోస్టుమార్టం చేసిన సంఘటన మండల కేంద్రం పుల్‌కల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..పుల్‌కల్‌కు చెందిన మ్యాతరి నవీన్ కుమార్(27) ఈ నెల 11న మృతి చెందాడు. మృతుడు సంగారెడ్డిలోని అస్తబల్ కాలనీలో అస్వస్థతకు గురవ్వడంతో తండ్రి శ్రీనివాస్ ఆస్పత్రిలో చికిత్స చేయించాడు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. ఐనప్పటికీ అతని ఆరోగ్యం మెరుగవ్వలేదు. దీంతో అతని ఆరోగ్యం వికటించి నవీన్ కుమార్ మృతిచెందాడు. మృతిపై కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం రాకపోవడంతో సహజ మరణమేనని భావించి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులకు తెలిసిన సమాచారంతో కొడుకు మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ సంగారెడ్డి పోలీసులను ఆశ్రయించారు. నవీన్ కుమార్ మృతిపై సందేహం వ్యక్తం చేస్తూ తల్లి సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు పోస్టుమార్టంకు ఆదేశించారు. ఉన్నతాదికారుల ఆదేశానుసారం పుల్‌కల్ పోలీసులు బుధవారం నవీన్ కుమార్ మృతదేహానికి కుటుంబ సభ్యుల సమక్షంలో పోస్టుమార్టం పూర్తి చేశారు.



పోస్టుమార్టం చేస్తున్న డాక్టర్లు

రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాలు

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో మంగళవారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షానికి విద్యుత్తు స్తంభాలు, పెద్ద, పెద్ద వృక్షాలు పడిపోయాయి. మర్పడ్గలో, రాంపల్లిలో విద్యుత్తు స్తంభాలు పడిపోగా, మర్పడ్గ నుంచి దుద్దెడకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై చెట్లు పడిపోయాయి. దీంతో ఆ రోడ్డు గుండా ప్రయాణానికి ఆటంకంగా మారింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై అడ్డంగా పడిన చెట్లను అధికారులు తొలగించకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతూ రోడ్డు కింద నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వర్షానికి భూమి తడిసిపోవడంతో వాహనాలు మట్టిలో దిగబడ్డాయి. మేదినిపూర్ విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు విరిగి విద్యుత్తు తీగలపై పడటంతో వ్యవసాయ బావులకు వెళ్లే త్రీ ఫేజ్ విద్యుత్తు సరఫరాను నిలిపేశారు. దీంతో పశువుల డెయిరీ ఫాం నిర్వాహకులు పశువులకు నీటిని అందించలేక, దాణాను మిషన్‌లో కటింగ్ చేయలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. వెంటనే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని రైతులు కోరారు.



దుద్దెడకు వెళ్లే రోడ్డుపై అడ్డంగా పడిపోయిన పెద్ద చెట్టు

సీఈఐఆర్‌తో చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ



బాధితుడికి మొబైల్ ఫోన్ అందజేస్తున్న ఎస్పీ



రామాయంపేట పోలీస్‌స్టేషన్లో సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీరోహిణి ప్రియదర్శిని

రామాయంపేట(మెదక్): సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ (సీఈఐఆర్)తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పేర్కొన్నారు. రామాయంపేట పోలీస్‌స్టేషన్లో రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందజేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పోలీస్‌శాఖ, టెలికాం శాఖలు సంయుక్తంగా ఈవెబ్‌సైట్‌ను రూపొందించారని, ఇది ఎంతో ఉపయోగకంగా ఉందన్నారు. ఫోన్‌ను అపహరించినవారు దాంట్లో మరో సిమ్‌కార్డు వేస్తే వెంటనే తమకు అలర్ట్ మెసెజ్ వస్తుందని, తద్వారా పోగొట్టుకున్న మొబైల్ గుర్తించడం సులభమవుతుందని ఆమె చెప్పారు. రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు ఫోన్లను స్వాధీనపర్చుకున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్ పాల్గొన్నారు.

సీఈఐఆర్‌తో మొబైల్ ఫోన్ల గుర్తింపు

మెదక్ మున్సిపాలిటీ: సీఈఐఆర్‌తో జిల్లాలో 12 మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే, చోరీకి గురైతే వెంటనే సీఈఐఆర్ నందు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇందుకోసం అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీసు నోడల్ అధికారులను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చామన్నారు. వినియోగదారులు నమోదు చేసుకున్న వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్లో నోడల్ అధికారులు జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న, చోరీకి గురైన 12 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. అనంతరం వాటిని బాధితులకు అందజేసినట్టు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.